16లోగా లైసెన్స్‌డ్ గన్స్ డిపాజిట్ చేయండి

రాష్ట్ర పోలీస్‌శాఖ ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో లైసెన్స్‌డ్ గన్స్‌ను ఈ నెల 16వ తేదీలోగా ఆయా పోలీస్‌స్టేషన్లలో డిపాజిట్ చేయాలని పోలీస్‌శాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. డిపాజిట్ చేసిన ఆయుధాలను డిసెంబర్ 10వ తేదీ నుంచి తిరిగి పొందవచ్చని తెలిపింది. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి ఆయుధాలు డిపాజిట్ చేయకుంటే వారిపై 'ఆయుధాల చట్టం 1959' ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఎన్నికల వేళ జాతీయ బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థల భద్రతా సిబ్బంది, క్రీడాకారులకు మినహాయింపు ఇస్తున్నట్టు వెల్లడించింది.

నియంతృత్వ బీజేపీకి బుద్ధి చెప్పాలి

- పొత్తులున్నా, లేకున్నా మిర్యాలగూడ నుంచి పోటీ
- మీడియాతో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నిడమనూరు, అక్టోబర్ 10: కేంద్రంలో నియంతృత్వ బీజేపీని గద్దెదింపడమే లక్ష్యంగా 28 పార్టీలతో ఏర్పడిన ఇండియా కూటమి అంటేనే ప్రధానికి భయం పట్టుకుందని, అందుకే ఇండియా పేరును భారత్‌గా మార్చాలని ప్రయత్నిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. నల్లగొండ జిల్లా నిడమనూరులో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. బీజేపీకి వ్యతిరేకంగా ఎవరు పనిచేసినా తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. పొత్తులు, సీట్ల సర్దుబాటు విషయంలో తాము పెద్దగా ఆసక్తి చూపడం లేదని, పొత్తు ఉన్నా, లేకపోయినా మిర్యాలగూడ శాసనసభ స్థానంలో సీపీఎం పోటీ చేస్తుందని ప్రకటించారు. నియంతృత్వ పోకడలతో రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీకి ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాత్రి 10 తర్వాత గప్‌చుప్

- రాత్రి 10 నుంచి ఉదయం 6 వరకు మైకులు బంద్
- ఆ సమయంలో బహిరంగ సభలు, ర్యాలీలు నిషేధం
- ప్రచార వాహనాలకు ఈసీ అనుమతి తప్పనిసరి
- మార్గదర్శకాలు జారీచేసిన కేంద్ర ఎన్నికల సంఘం

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రాజకీయ పార్టీలు పాటించాల్సిన నియమాలపై కేంద్రం ఎన్నికల సంఘం పలు మార్గదర్శకాలు జారీ చేసింది. రాష్ట్రంలో ఎన్నికలు ముగిసే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఆదేశించింది. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మైకులకు (లౌడ్ స్పీకర్లు) అనుమతి లేదని స్పష్టంచేసింది. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది.

ఎన్నికల నియమావళిలోని కొన్ని కీలక అంశాలు

- ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే బహిరంగ సభలు, ర్యాలీలు నిర్వహించాలి. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటలలోపు సభలు, ర్యాలీలు నిషేధం.
- వాహన చట్టానికి లోబడే వాహనాలకు లౌడ్‌స్పీకర్లు అమర్చుకోవాలి. వాహనాల బయట డిజైన్ చేసేటప్పుడు నిబంధనలు పాటించాలి. ఇందుకు సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలి.
- ఎన్నికల ప్రచారానికి అభ్యర్థి పేరుతో అనుమతి తీసుకున్న వాహనాన్ని మాత్రమే వినియోగించాలి.
- స్టార్ క్యాంపెయినర్ల వాహనాలకు ముందస్తుగానే ఈసీ నుంచి అనుమతి తీసుకోవాలి. ఎవరి పేరుతో అయితే అనుమతి తీసుకున్నారో.. ఆ వాహనాన్ని ఆ వ్యక్తి మాత్రమే వినియోగించాలి.
- ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో రాజకీయ ప్రచారాలు, ఆ పరిసరాల్లో ర్యాలీలకు అనుమతి లేదు.
- అభ్యర్థి డమ్మీ ఈవీఎంతో ఓటర్లకు అవగాహన కల్పించవచ్చు. ఆ డమ్మీ ఈవీఎం చెక్క లేదా ప్లాస్టిక్‌తో తయారు చేసినదై ఉండాలి. గోధుమ, పసుపు, బూడిద రంగులో పెయింట్ చేసి ఉండాలి.
- ఓటింగ్ గురించి అవగాహన కల్పించాలి అనుకుంటే తెల్ల కాగితంపై రాసిన స్లిప్పులను మాత్రమే వాడాలి.
- పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి ఎన్నికల ప్రచారాలు చేయకూడదు. ఆ నియోజకవర్గం పరిధిలో ఓటర్లు కాని వ్యక్తులు నివాసం ఉండకూడదు.
- పోలింగ్ స్టేషన్‌లోకి భద్రతా సిబ్బందిని అనుమతించరు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలోనే భద్రతా సిబ్బంది వేచి చూడాలి.
- పోలింగ్‌కు 48 గంటల ముందు నుంచి పత్రికలు, టెలివిజన్‌లలో ఎన్నికల ప్రచారాలకు సంబంధించినవి ప్రసారం చేయకూడదు.
- ఎలక్షన్ షెడ్యూల్ ప్రకటించడానికి ముందే ప్రారంభమైన పథకాలు, కార్యక్రమాలు కొనసాగించుకోవచ్చు.
- వరదలు, కరవు, మహమ్మారులు, ఇతర ప్రకృతి విపత్తులు వస్తే ప్రభావిత ప్రాంతాల్లో సహాయ, పునరావాస చర్యలు చేపట్టొచ్చు.
- క్రిటికల్ ఇల్‌నెస్‌తో బాధపడేవారికి వైద్య సదుపాయం, వైద్యం కోసం నగదు సాయం చేయాలి అనుకుంటే తగిన అనుమతులు తీసుకుని చేయవచ్చు.

సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ప్రతినిధులను సన్మానిస్తున్న సీఈవో వికాస్‌రాజ్

సైకిల్ ర్యాలీతో నెరవేరిన లక్ష్యం

- ఓటరు నమోదు, ఓటింగ్ శాతం పెరుగుదలపై అవగాహన
- 800 కిలోమీటర్లు తిరిగి హైదరాబాద్ చేరుకున్న బృందం
- ప్రతినిధులను సన్మానించిన సీఈవో వికాస్‌రాజ్

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): ఓటరు నమోదు, ఓటింగ్ శాతం పెరుగుదలపై రాష్ట్రంలో 800 కిలోమీటర్ల మేర నిర్వహించిన సైకిల్ ర్యాలీతో అనుకున్న లక్ష్యం నెరవేరిందని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) వికాస్‌రాజ్ తెలిపారు. హైదరాబాద్ జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం కమిషనర్ రోనాల్డ్ రోస్, జాయింట్ సీఈవో సర్ఫరాజ్ అహ్మద్ సైకిల్ ర్యాలీ బృందంతో సమావేశమయ్యారు. ఈ నెల 4న దుర్గం చెరువు వద్ద ఓటరు అవగాహనపై రాష్ట్ర వ్యాప్త సైకిల్ ర్యాలీని కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ ఆఫీసర్ రాజీవ్‌కుమార్ ప్రారంభించినట్టు చెప్పారు. యువ ఓటర్లకు అవగాహన కల్పించేందుకు పలు కాలేజీలను సందర్శించి ఓటరు నమోదు, ఓటింగ్‌పై పూర్తి అవగాహన కల్పించినట్టు వివరించారు. హైదరాబాద్ సహా జనగాం, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, కరీంనగర్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో సైకిల్ ర్యాలీ నిర్వహించినట్టు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన ఈ సైకిల్ ర్యాలీ దేశంలోనే మొట్టమొదటిసారిగా నిర్వహించారని తెలిపారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న ప్రతినిధులను సన్మానించారు. సైక్లింగ్ రాష్ట్ర స్థాయిలో పాల్గొనేందుకు అవకాశం కల్పించిన సీఈవోకు వైమానిక రిటైర్డ్ డైరెక్టర్ జనరల్ మోహన్ అభినందనలు తెలిపారు.

ఎన్నికల్లో తొలిసారిగా యాప్ సాంకేతికత

- అధికారులకు ఈ-ఎస్ఎంఎస్, పౌరుల కోసం సీ-విజిల్
- ఐదు రాష్ట్రాల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన ఎన్నికల సంఘం

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): ఐదు రాష్ట్రాలకు జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా ఎన్నికల సంఘం యాప్ సాంకేతికతను వినియోగిస్తున్నది. అధికారుల కోసం ఈ-ఎస్ఎంఎస్, పౌరుల కోసం సీ-విజిల్ యాప్‌ను ప్రవేశపెట్టింది. తనిఖీలలో దొరికే నగదు, మద్యం, డ్రగ్స్, బహుమతులను ఎప్పటికప్పుడు ఆయా సంస్థలకు అప్పగించడానికి, డబ్బును బ్యాంకుల్లో డిపాజిట్ చేయడానికి, ఐటీ శాఖను సకాలంలో అప్రమత్తం చేయడానికి 'ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' (ఈ-ఎస్ఎంఎస్) అనే యాప్‌ను వినియోగిస్తున్నది. ఎన్నికల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొనే అధికారులందరూ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, ఎప్పటికప్పుడు వివరాలను ఈఎస్ఎంఎస్ యాప్‌లో పొందుపర్చాల్సి ఉంటుంది. గత ఎన్నికల్లో దొరికిన నగదు, మద్యం, డ్రగ్స్ వంటి వివరాలను సరైన సమయంలో నమోదు చేయకపోవడం వల్ల కొంత దుర్వినియోగం జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈసారి పకడ్బందీగా నిర్వహించేందుకు ఈ-ఎస్ఎంఎస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

అక్రమాలపై ఫిర్యాదుకు..

ఎన్నికల వేళ జరిగే అక్రమాలను పౌరులు ఎప్పటికప్పుడు సీవిజిల్ యాప్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయవచ్చు. ఎవరైనా కోడ్‌ను ఉల్లంఘించినా కూడా ఆ ఘటనలను ఈయాప్‌ద్వారా తెలియజేయవచ్చు. ఆయా పార్టీల అభ్యర్థులు పంచే డబ్బులు, మద్యం, బహుమతులు వంటి వివరాలను నేరుగా 'సీ-విజిల్' యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. అలాగే లౌడ్‌స్పీకర్లు వాడినా, మతాలు, కులాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, పర్మిషన్ లేకుండా ఎన్నికల ర్యాలీలు నిర్వహించినా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఈ యాప్‌ను గూగుల్, యాపిల్ ప్లే స్టోర్ల నుంచి డౌన్‌లోడ్ చేసుకొని తమ చుట్టుపక్కల జరుగుతున్న అక్రమాలను

పొందుపరచవచ్చు. ఈ యాప్‌ను ఇప్పటికే పది లక్షల మంది పౌరులు డౌన్‌లోడ్ చేసుకున్నారు. ఈ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులపై పది నిమిషాల వ్యవధిలోనే సంబంధిత అధికారులు అక్కడికి వచ్చి తగిన చర్యలు తీసుకుంటారు. ఈ చర్యల ద్వారా ప్రజల్లో, వ్యవస్థలో జవాబుదారీతనం పెరుగుతుందని ఎన్నికల కమిషన్ భావిస్తున్నది.

సీఎస్ నేతృత్వంలో 'కోడ్' స్క్రీనింగ్ కమిటీ

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో జరుగనున్న శాసన సభ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని మరింత పకడ్బందీగా అమలు చేసేందుకు ప్రత్యేకంగా స్క్రీనింగ్ కమిటీనీ ఏర్పాటు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తెలిపారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ (ఎంసీసీ) అమలు చేసేందుకు వచ్చే ప్రతిపాదనలను పరిశీలించేందుకు ఈ ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం సూచనలమేరకు ఏర్పాటుచేసిన ఈ కమిటీకి సీఎస్ శాంతికుమారి చైర్మన్‌గా, ఆయా శాఖల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శుల తోపాటు జీఏడీ కార్యదర్శి సభ్యులుగా ఉంటారని సీఎస్ తెలిపారు. ఎంసీసీ అమలు ప్రతిపాదనలను ఈ కమిటీ పరిశీలించి ముఖ్య ఎన్నికల అధికారి ద్వారా కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదిస్తుందని మంగళవారం జారీచేసిన ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాలు 4,400

- ప్రాథమికంగా గుర్తించిన రాష్ట్ర పోలీసు శాఖ
- కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక అందజేత
- ట్రై కమిషనరేట్లలో 1,100 ప్రాంతాల గుర్తింపు
- పోలింగ్‌కు అదనంగా సిబ్బంది కేటాయింపు

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా 4,400 సమస్యాత్మక ప్రాంతాలున్నట్టు రాష్ట్ర పోలీసుశాఖ ప్రాథమికంగా గుర్తించింది. ఆ వివరాలను ఎన్నికల సంఘానికి ఇటీవల సమర్పించింది. నోటిఫికేషన్ వెలువడగానే అదనపు బలగాలను ఆయా ప్రాంతాలకు కేటాయించనున్నది. ట్రై కమిషనరేట్లలో 1,100 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించారు. హైదరాబాద్ కమిషనరేట్‌లో 550, రాచకొండ కమిషనరేట్‌లో 350, సైబరాబాద్ కమిషరేట్ పరిధిలో 200 సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించినట్టు అడిషనల్ డీజీ ఒకరు 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. మిగిలిన 3,300 ప్రాంతాలను జిల్లాల్లో గుర్తించామని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన తర్వాత.. ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్టు చెప్పారు. ఎన్నికల్లో ఆయా నియోజకవర్గాల్లో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థుల ఆధారంగా సిబ్బందిని పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు ఉన్నతాధికారులు తెలిపారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి సుమారు 20 వేల మంది వరకు హోంగార్డులను ఎన్నికల కోసం అడిగామన్నారు.

బీఆర్ఎస్ గెలుపు కోసం తిరుపతి వరకు చేపట్టిన ఆనంద్‌గౌడ్ సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత

కేసీఆర్ మళ్లీ సీఎం కావాలని సైకిల్‌యాత్ర

కంటోన్మెంట్, అక్టోబర్ 10: వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకే మళ్లీ అధికారం దక్కాలి.. కేసీఆర్ సీఎంగా హ్యాట్రిక్ సాధించాలి.. అని కోరుతూ ఓ అభిమాని మంగళవారం తిరుపతి సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టాడు. ఈ మేరకు నగరంలోని రామంతపూర్‌కు చెందిన మిట్టకోరి ఆనంద్‌గౌడ్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందిత క్యాంప్ కార్యాలయం నుంచి ఈ యాత్రను చేపట్టాడు. ఈ యాత్ర ఎల్‌బీనగర్, నల్లగొండ, మిర్యాలగూడ, పిడుగురాళ్ల, ఒంగోలు, అద్దంకి, గూడురు, శ్రీకాళహస్తి మీదుగా తిరుపతికి 15 రోజుల్లో చేరుకుంటుందని, వేంకటేశ్వరస్వామిని దర్శించుకొని వేడుకుంటానని ఆనంద్‌గౌడ్ ఈ సందర్భంగా చెప్పారు. గులాబీ పార్టీ గెలువాలనే సంకల్పంతో ఆనంద్‌గౌడ్ గతంలో నాలుగుసార్లు తిరుపతికి సైకిల్ యాత్ర చేపట్టడం విశేషం. 2018 అసెంబ్లీ, 2019లో పార్లమెంట్, 2020లో జీహెచ్ఎంసీ, 2021 ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ఆయన సైకిల్ యాత్ర చేపట్టాడు. బీఆర్ఎస్ గెలుపు కోసం ఎన్ని యాత్రలు చేపట్టడానికైనా తాను సిద్ధంగా ఉన్నానని ఆనంద్‌గౌడ్ స్పష్టం చేశారు.

ఓటర్ల జాబితాపై అనుమానాల నివృత్తి

- ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించిన ఎన్నికల సంఘం
- వాటిలో 98 శాతం అవాస్తవాలే
- ఇల్లిల్లూ తిరిగి నివేదిక రూపొందించిన సిబ్బంది

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): ఓటర్ల జాబితాపై వివిధ పార్టీలు, ప్రజల నుంచి వ్యక్తమైన అనుమానాలను ఎన్నికల సంఘం నివృత్తి చేసింది. తమకు వచ్చిన ఫిర్యాదుల్లో 98 శాతం అపోహలేనని, కేవలం రెండు శాతం మాత్రమే వాస్తవాలు అని పేర్కొంది. ఫిర్యాదులపై తమ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించారని తెలిపింది. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 2.91 లక్షల ఓట్లపై ఈసీకి ఫిర్యాదులు వచ్చాయి. ఒకే ఇంటి నంబర్‌తో వేల సంఖ్యలో ఓట్లు ఉన్నాయని, ఆ ఓట్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఉన్నాయని, స్థానికంగా లేని వారి పేర్లు జాబితాలో చేర్చారని పలువురు ఫిర్యాదు చేశారు. వీటిని పరిశీలించిన ఎన్నికల సిబ్బంది ఆ జాబితాలో ఎటువంటి లోపాలు లేనట్టు గుర్తించింది. ఒకే ప్రాంతానికి చెందిన 53 వేల మంది ఓట్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఉన్న మాట నిజమే. ఒకే కుటుంబానికి చెందిన సభ్యుల ఓట్లు వేర్వేరు కేంద్రాల్లో ఉన్నాయి. అయితే ఆ కేంద్రాలు ఒకే ప్రాంగణం (స్కూల్/కాలేజీ)లో ఉన్నట్టు గుర్తించారు. దీనివల్ల ఎటువంటి సమస్య లేదని పేర్కొన్నారు. ఒకే ఇంటి నంబర్‌తో 47,025 ఓట్లు ఉన్నట్టు గుర్తించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో గతంలో కొన్ని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు జీహెచ్ఎంసీలో కలిశాయి. కానీ ఆ గ్రామాలు, మున్సిపాలిటీలలో ఇంటి నంబర్లు పాతవే కొనసాగుతున్నాయి. ఉదాహరణకు 1-1 అనే ఇంటి నంబర్ మున్సిపాలిటీలో, గ్రామ పంచాయతీలో కూడా ఉంటుంది. అవి జీహెచ్ఎంసీలో విలీనం అయిన తరువాత కూడా అవే ఇంటి నంబర్లు కొనసాగుతున్నాయి. ఓటర్ల జాబితాలో చూసినప్పుడు ఒకే ఇంటి నంబర్‌తో ఎక్కువ పేర్లు కనిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల అవే ఇంటి నంబర్లకు బై నంబర్లు ఇచ్చారు. వీటిపై కూడా ఫిర్యాదులు వచ్చాయి. ఇవన్నీ సరైన పేర్లేనని, అక్రమాలు లేవని తేల్చారు.

గ్రేటర్‌లో..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కూడా ఓటర్ల జాబితాపై అనేక ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో ఎన్నికల సంఘం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టింది. గత రెండేండ్లలో చనిపోయిన వారి వివరాలను ఇంటి నంబర్ ఆధారంగా గుర్తించారు. మృతుల వివరాలను దవాఖానల నుంచి కూడా సేకరించారు. అయితే వారిలో ఎక్కువ మంది ఇతర జిల్లాలకు చెందిన వారు ఉన్నట్టు గుర్తించారు. మొత్తానికి మృతుల పేర్లను జాబితా నుంచి తొలగించారు.

నిర్మల్‌లో..

నిర్మల్ నియోజకవర్గంలో 41వేల ఓట్లపై ఫిర్యాదులు అందాయి. ఒకే ఇంటి నంబర్‌తో ఉన్న ఓట్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఉన్నాయని, స్థానికంగా లేని వారి పేర్లు జాబితాలో ఉన్నాయని ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయి విచారణ జరిపింది. వీటిలో 37,695 మంది ఓటర్లు ఆ నియోజకవర్గం పరిధిలోనే ఉన్నారు. కొందరు ఇల్లు మారినా వారు పాత పోలింగ్ కేంద్రంలోనే ఓటు హక్కు వినియోగించుకుంటామని సమాధానం ఇచ్చారు. వారు చిరునామా మార్పునకు అవసరమైన ఫారం-7ను అందించడానికి వారు నిరాకరించారు. ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన 809 మంది పేర్లను తొలగించారు.

సంక్షిప్తం

భూపాలపల్లి జిల్లా గుడాడ్‌పల్లిలో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో గండ్ర వెంకటరమణారెడ్డికే మా ఓటు అంటూ నినాదాలు చేస్తున్న గ్రామస్థులు

గండ్ర వెంకటరమణారెడ్డికే మా ఓటు

- మద్దతు ప్రకటించిన గుడాడ్‌పల్లి గ్రామస్థులు

జయశంకర్ భూపాలపల్లి, అక్టోబర్ 10(నమస్తే తెలంగాణ): 'ఎన్నికలు ఏవైనా మేం బీఆర్ఎస్ వెంటే ఉంటం.. కారు గుర్తుకే మా ఓటు.. ఏ పార్టీకీ ఇక్కడ చోటు లేదు.. మా ఓటు గండ్ర వెంకటరమణారెడ్డికే' అని జయశంకర్ భూపాలపల్లి జిల్లా భూపాలపల్లి మండలం గుడాడ్‌పల్లి గ్రామస్థులు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇటీవల గుడాడ్‌పల్లి నిరుపేదలకు 40 డబుల్ బెడ్రూం ఇండ్లను మంజూరు చేసింది. ఆ నిరుపేదలందరూ మంగళవారం గృహప్రవేశం చేశారు. ఈ కార్యక్రమానికి భూపాలపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి, ఆయన సతీమణి గండ్ర జ్యోతిని ఆహ్వానించి కృతజ్ఞత సభను ఏర్పాటు చేశారు. గ్రామానికి చేరుకున్న గండ్ర దంపతులకు గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికీ పిలిచి బొట్టుపెట్టి శాలువాలతో సన్మానించారు. అనంతరం గ్రామ సర్పంచ్ ఉడుత లక్ష్మీఐలయ్య యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన కృతజ్ఞత సభలో.. 'గ్రామస్థులందరూ గండ్ర వెంకటరమణారెడ్డి వెంటే ఉంటారు. ఆది నుంచి మా గ్రామం బీఆర్ఎస్ వెంటే ఉన్నదని, ఇప్పుడు కూడా మీ వెంటే ఉంటది' అని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇదే గ్రామానికి చెందిన జడ్పీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభ రఘుపతిరావు దంపతులు, గ్రామ సర్పంచ్ ఉడుత లక్ష్మీఐలయ్య యాదవ్ దంపతులు గండ్ర రమణారెడ్డి, జ్యోతిలకు బొట్టుపెట్టి కొత్త వస్త్రాలు బహూకరించారు.

బీఆర్ఎస్ అభ్యర్థికే మా మద్దతు

నిజాంసాగర్, అక్టోబర్ 10: కామారెడ్డి జిల్లా మహ్మద్‌నగర్ మండలంలోని హసన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పిప్పిరేగడి తండాకు చెందిన గిరిజనులు రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే హన్మంత్ షిండేకు మద్దతు ప్రకటించారు. ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేసి మంగళవారం ఉమ్మడి జిల్లాల మాజీ జడ్పీ చైర్మన్ దఫేదార్ రాజుకు అందజేశారు.

కోనాపూర్‌లో ఏకగ్రీవాల జోరు

కమ్మర్‌పల్లి, అక్టోబర్ 10: నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలోని కోనాపూర్‌లో బాల్కొండ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానాల జోరు కొనసాగుతున్నది. వరుసగా మూడు రోజులుగా ఎనిమిది సంఘాలు ఏకగ్రీవ తీర్మానాలు చేయగా.. మంగళవారం నాలుగు సంఘాలకు చెందిన 232 కుటుంబాలు వేముల ప్రశాంత్‌రెడ్డికి మద్దతు ప్రకటించాయి. వాసంగట్టు తండా సంఘానికి చెందిన 90 కుటుంబాలు, ఎస్సీ మాదిగ సంఘానికి చెందిన 70 కుటుంబాలు, పద్మశాలి సంఘానికి చెందిన 40 కుటుంబాలు, శాలివాహన సంఘానికి చెందిన 32 కుటుంబాలు చేసిన ఏకగ్రీవ తీర్మానాలను స్థానిక నాయకులకు అందజేశాయి.

958.33 కోట్ల విద్యుత్తు సబ్సిడీ విడుదల

హైదరాబాద్, అక్టోబర్ 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వ్యవసాయంతోపాటు వివిధ ప్రాజెక్టులకు సరఫరా చేస్తున్న విద్యుత్తు సబ్సిడీ కింద అక్టోబర్ నెల బడ్జెట్ మొత్తాన్ని ప్రభుత్వం మంగళవారం విడుదల చేసింది. వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులు, హెచ్ఎండబ్ల్యూస్, ఎస్‌బీ, మిషన్ భగీరథ పథకాలకు అందించే సబ్సిడీ కింద రూ.958.33 కోట్ల బడ్జెట్‌ను ట్రాన్స్‌కోకు విడుదల చేస్తూ విద్యుత్తు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మొత్తాన్ని తెలంగాణ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీల పూల్ అకౌంట్‌లో జమ చేయాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నది.

మంత్రి నిరంజన్‌రెడ్డి గెలవాలని అయ్యప్ప భక్తుడి పాదయాత్ర

వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం గుమ్మడం గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తుడు కావలి అశోక్ మంత్రి నిరంజన్‌రెడ్డిపై అభిమానాన్ని చాటుకున్నాడు. త్వరలో జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో నిరంజన్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందాలని కాంక్షిస్తూ శబరిమలకు మహాపాదయాత్ర చేపట్టాడు. మంగళవారం తెల్లవారుజామున జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయం నుంచి యాత్రకు శ్రీకారం చుట్టాడు. 1,170 కిలోమీటర్ల దూరంలోని శబరిమలకు 30 రోజుల్లో చేరుకునేలా ప్రణాళిక సిద్ధం చేసినట్టు చెప్పాడు.

-పెబ్బేరు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్

3.35 కోట్ల హవాలా సొమ్ము సీజ్

- బంజారాహిల్స్‌లో స్వాధీనం
- నలుగురు హవాలా వ్యాపారుల అరెస్టు
- కోటి సొమ్ము డెలివరీకి 25 వేల కమీషన్

బంజారాహిల్స్, అక్టోబర్ 10: బంజారాహిల్స్‌లో పోలీసులు మంగళవారం చేపట్టిన తనిఖీల్లో రూ.3.35 కోట్ల హవాలా సొమ్మును పట్టుబడింది. వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్ డేవిస్ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. బంజారాహిల్స్, నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా బంజారాహిల్స్‌లోని టీవీ9 జంక్షన్ సమీపంలో వాహన తనిఖీ చేపట్టారు. టీఎస్ 09448 నంబర్ గల కియా కారును తనిఖీ చేయగా భారీగా నోట్ల కట్టలు లభ్యమయ్యాయి. వాటిని లెక్కించగా, రూ.3.35 కోట్ల నగదుగా తేలింది. కారులో ఉన్న నలుగురిని పోలీసులు ప్రశ్నించగా.. తాము గోషామహల్, బేగంపేట ప్రాంతాల నుంచి హవాలా సొమ్మును సేకరించి జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ తదితర ప్రాంతాల్లో డెలివరీ చేస్తామని తెలిపారు. పట్టుబడినవారిలో చందరానగర్‌లోని వైఎన్ ఆర్ గ్రీన్‌హిల్స్‌లో నివసించే చింపిరెడ్డి హనుమంతరెడ్డి (48), ముషీరాబాద్ నివాసి బచ్చల ప్రభాకర్(52), మదీనగూడ సాయినగర్ కాలనీకి చెందిన మందల శ్రీరాములురెడ్డి (41), మందల ఉదయ్‌కుమార్‌రెడ్డి (23) ఉన్నారు. బంజారాహిల్స్ రోడ్డు నంబర్-3 లోని